# ఘటా ఘట్..

## మంచిర్యాలలో రూ.2 కోట్లతో ధోబీఘాట్ నిర్మాణం

### శరవేగంగా సాగుతున్న పనులు



ధోబీఘాట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్ రావు(ఫైల్)



ధోబీఘాట్ల నిర్మాణానికి తీసిన గుంతలు

మంచిర్యాల టౌన్, అక్టోబర్ 30 : రజకుల కుటుంబాల్లో వెలుగులు నింపడానికి తెలంగాణ ప్రభుత్వం మంచిర్యాల పట్టణంలో అధునాతన ధోబీఘాట్‌ను నిర్మిస్తోంది. రూ.2 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు వెచ్చించి ఒకటో వార్డులోని రాజీవ్ నగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను గతనెల 23న స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య ప్రారంభించారు. కాగా.. ఈ పనులు చకచకా సాగుతున్నాయి. ఏడాదిలో పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మోడ్రన్ ధోబీఘాట్ నిర్మాణం పూర్తయితే పట్టణంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో రజక వృత్తిని చేసుకునే వారికి మేలు జరగనుంది. సులభంగా తక్కువ సమయంతో ఎక్కువ మొత్తంలో దుస్తులను శుభ్రపరచడంతోపాటు ఇస్త్రీ కూడా చేసి బయటకు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం అధునాతన వాషింగ్ మిషన్లు, మోటార్లు వాడనున్నారు. అధికంగా హోటళ్లు, లాడ్జీలు, ఆస్పత్రుల్లో ధోబీ పనులు చేసేవారికి మేలు చేకూరనుంది. పట్టణంలో లాడ్జీలు, హోటళ్లు, ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ దవాఖానలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో పనిచేసేవారు పనిచేసే చోట, వారి ఇండ్లు, సమీపంలోని వాగులు, వంకల్లో బట్టలు శుభ్రం చేస్తున్నారు. అధునాతన ధోబీఘాట్ నిర్మాణం పూర్తయితే ఒకేచోట వందల సంఖ్యలో బట్టలను ఉతుక్కునే వీలుంటుంది. పరిశుభ్రమైన నీటిలో దుస్తులను శుభ్రపరుస్తారు. కాగా.. రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ధోబీఘాట్ నిర్మాణంలో గ్రౌండ్ ఫ్లోర్ పార్ట్‌లో సివిల్ ఐటంల కోసం రూ.53.90 లక్షలు వెచ్చిస్తున్నారు. అంతర్గత విద్యుత్ పనుల కోసం రూ.5.52 లక్షలు, వాటర్ సప్లయ్, శానిటరీ ఐటంలు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాల కోసం రూ.8.01 లక్షలు, బోర్‌వెల్‌ల నిర్మాణం, పంప్‌సెట్‌ల కోసం రూ. 4.15 లక్షలు, లాండ్రీ యంత్రాలు సరఫరా, అమర్చడం కోసం రూ.29.40 లక్షలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.21.68 లక్షలు, ద్వి, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు రూ.1.91 లక్షలు, పది ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.1.83 లక్షలు, గ్రీనరీ అభివృద్ధికి రూ.1.45 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.16.04 లక్షలు వెచ్చించనున్నారు.



ధోబీఘాట్ల నిర్మాణ పనులు

### సౌకర్యంగా ఉంటుంది..



*ధోబీఘాట్ నిర్మాణం పూర్తయితే రజక వృత్తివారికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటివరకు పెద్ద మొత్తంలో బట్టలు ఉతికే వారు వాగులు, నదుల వద్దకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి బట్టలు ఉతికే పరిస్థితి ఉండేది. వర్షాకాలంలో అయితే పరిస్థితి వర్ణనాతీతం. పరిశుభ్రమైన నీరు దొరికేది కాదు. ఇండ్లలో ఉతికే వారు నీళ్లు తక్కువగా వాడి పనికానిచ్చేవారు. ఆస్పత్రులు, లాడ్జీలు, హోటళ్లలో ఉతికేవారు అయితే వంతుల వారిగా పనికి వెళ్లాల్సి వచ్చేది. కానీ.. ధోబీఘాట్ నిర్మాణంతో ఎప్పుడంటే అప్పుడే బట్టలను ఉతుక్కునే వీలుంటుంది. ఇంతపెద్ద మొత్తంలో ఖర్చుచేసి ధోబీఘాట్‌ను నిర్మిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.*

***- పారిపల్లి శ్రీనివాస్, రజక సంఘం మంచిర్యాల పట్టణాధ్యక్షుడు.***

# తీరిన చిరకాల స్వప్నం

## రాళ్లవాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు



రాళ్లవాగు పైనుంచి పొంగి ప్రవహిస్తున్న వరద (ఫైల్)

మంచిర్యాల టౌన్, అక్టోబర్ 30 : మంచిర్యాల పట్టణంలోని రంగంపేట, పవర్‌సిటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, అండాళమ్మకాలనీ ప్రాంతాల్లో నివసించే ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. ఈ ప్రాంతాలకు బైపాస్ రోడ్డుతో కనెక్టివిటీకి మధ్యలో ఉన్న రాళ్లవాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టీఎఫ్ఐడీసీ నుంచి రూ.12 కోట్లు మంజూరు చేస్తూ జీవో నంబర్ 723, సెప్టెంబర్ 22, 2023 న విడుదల చేసింది. బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్తూపం నుంచి రాళ్లవాగు మీదుగా అవతల ఉన్న రంగంపేట వైపుకు హై లెవెల్ వంతెనను నిర్మించనున్నారు. వంతెన డిజైన్, టెండరు ప్రక్రియ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాక వంతెన పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు రాళ్లవాగుపై లో లెవెల్ కాజ్‌వే ద్వారా ప్రజలు రాకపోకలు సాగించేవారు. వర్షాకాలంలో వరదనీరు ఉప్పొంగి పొర్లడం, వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోవడం, తిరిగి మరమ్మతులు చేసేదాకా రాకపోకలు నిలిచి ప్రజలు ఇతర మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు. ఈ సమస్యను రంగంపేట, పవర్‌సిటి ప్రాంతాల ప్రజలు పలుమారు ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీతల దృష్టికి తీసుకువెళ్లారు. శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని కోరారు. ఈ మేరకు సమస్యను ఎమ్మెల్యే దివాకర్‌రావు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేశారు. దీంతో పట్టణానికి పడమటి దిశగా రాళ్లవాగుకు అవతల ఉన్న ప్రాంతాలతో రవాణా సౌకర్యాలు మెరుగవనున్నాయి. 20 ఏళ్ల క్రితం రాళ్లవాగుపై కాజ్‌వేను నిర్మించారు. ప్రతి వర్షాకాలంలో వరద ప్రవాహం పెరిగినపుడు కాజ్‌వే పైనుంచి నీరు ఉప్పొంగి ప్రవహించేది. దీంతోపాటు పలుసార్లు కాజ్‌వే పై వేసిన రోడ్డు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టాయనుకున్న తరువాత మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించేవారు. దీంతో హై లెవెల్ వంతెనను నిర్మించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో శాశ్వత పరిష్కారం లభించింది. తొమ్మిదో వార్డు పరిధిలో ఉండే రంగంపేట నుంచి రోజు ఉదయం పట్టణంలోని ఇతర ప్రాంతాలకుపాలు, కూరగాయలు తీసుకొచ్చే వ్యాపారుల సంఖ్య పెద్దగానే ఉంటుంది. రాళ్లవాగుపై కాజ్‌వే మునిగిన ప్రతిసారి పాత మంచిర్యాల, అండాళమ్మ కాలనీ మీదుగా క్వారీ రోడ్డు నుంచి పట్టణానికి చేరుకునేవారు.

### చిరకాల కోరిక నెరవేరుతోంది..



*రాళ్లవాగుపై వంతెన నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని ఎమ్మెల్యే దివాకర్‌రావు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేము కూడా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందించాం. దీనికి స్పందించిన ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. దీంతో రంగంపేట, అండాళమ్మకాలనీ, గ్రీన్‌సిటి, పవర్‌సిటి, శ్రీలక్ష్మి నగర్, పాతమంచిర్యాల వాసులకు ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా రంగంపేట వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. 20 ఏళ్ల కిందట నిర్మించిన కాజ్‌వే తరచూ మునిగిపోవడం, వరదకు కొట్టుకు పోవడం జరిగింది. మరమ్మతుకు మున్సిపాలిటీ నుంచి నిధులు వెచ్చిస్తున్నాం. అయినా శాశ్వత పరిష్కారానికి మా వంతు ప్రయత్నం చేశాం. మా విన్నపాన్ని మన్నించి నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు, ఇందుకోసం కృషిచేసిన ఎమ్మెల్యే దివాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.*

***- పెంట రాజయ్య, మున్సిపల్ చైర్మన్, మంచిర్యాల***



రేచిని పెద్ద చెరువు మత్తడి

# 'మిషన్' పటిష్టం

- కోట్లాది రూపాయలతో చెరువుల పునరుద్ధరణ
- తాండూర్ మండల వ్యాప్తంగా 28 చెరువులు
- పెరిగిన భూగర్భ జలాలు, సాగు విస్తీర్ణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తాండూర్, అక్టోబర్ 30 : వ్యవసాయానికి మూలాధారం చెరువులేనని తెలిసినా సమైక్య పాలనలో వాటిని అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని చెరువులన్నీ పటిష్టమయ్యాయి. మండలంలో చిన్ననీటి పారుదల శాఖ కింద 48 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులోని 28 చెరువులు, కుంటల కట్టల పునరుద్ధరణ, పూడికతీత పనులు, తూములు నిర్మించారు. మొత్తం నాలుగు విడుతల్లో పనులు చేపట్టగా.. మొదటి విడుతలో రూ.93.25 లక్షలు.. రెండో విడుతలో రూ.1.95 కోట్లు, మూడో విడుతలో రూ.89 లక్షలు.. నాలుగో విడుతలో రూ.25 లక్షలతో చెరువులు, కుంటల పనులు పూర్తయ్యాయి.

### పెరిగిన సాగు విస్తీర్ణం..

కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి చెరువులో పూడికతీయడంతో చెరువుల లోతు పెరిగింది. తద్వారా నీటి నిల్వ సామర్థ్యంతోపాటు భూగర్భ జలాలు పెరిగి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం మొదటి విడుత కింద పనులు చేపట్టిన చెరువుల కింద, 1,137, రెండో విడుత 970, మూడో విడుత 410, నాలుగో విడుత చెరువుల కింద 100 ఎకరాలు సాగవుతోంది. మిషన్ కాకతీయ పథకం వ్యవసాయానికి ఆయువుపట్టుగా మారిందని, సాగు విస్తీర్ణం పెరిగిందని, సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చెరువుల కట్టలు బలంగా మారాయి..



*మండలంలోని 28 చెరువులు, కుంటల్లో మిషన్ కాకతీయ పనులు పూర్తయ్యాయి. అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలను నాలుగు భాగాలుగా విభజించి పనులు పూర్తి చేయించాం. చెరువుల కట్టలను బలంగా చేశాం. చెరువుల్లో పూడిక తీయించాం. అలుగులు, తూములను నిర్మించాం. నాలుగో విడుతలో చేపట్టిన పనుల్లో చిన్నచిన్న పనులు మినహా దాదాపు పూర్తయ్యాయి. ఈ పథకంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. బోర్లు, బావుల నుంచి సాగుకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయి.* ***- కొప్పల రవీందర్, ఇరిగేషన్ ఏఈ, తాండూర్.***